నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, శనివారం 27 ఏప్రిల్ 2024 | SURYAPET

## నల్లగొండలో 25 మంది నామినేషన్లు తిరస్కరణ

- 31 మంది నామినేషన్లకు ఓకే చెప్పిన అధికారులు

నల్లగొండ, ఏప్రిల్ 26 : వచ్చే నెల 13న జరిగే నల్లగొండ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి 56 మంది అభ్యర్థులు ఆయా పార్టీలతోపాటు స్వతంత్రంగా నామినేషన్లు వేయగా వారిలో 25 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఈ నెల 18 నుంచి 25 వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగగా నల్లగొండ పార్లమెంట్ స్థానానికి 56 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వారిలో 31 మంది అభ్యర్థుల నామినేషన్లు అంగీకరించగా, 25 మంది అభ్యర్థుల నామినేషన్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఈ నెల 29న నామినేషన్ల ఉపసంహరణకు ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చింది. వచ్చే నెల 13న పోలింగ్ నిర్వహించి, జూన్ 4న ఫలితాలు వెల్లడించనుంది.

### భువనగిరిలో 10 మంది నామినేషన్లు తిరస్కరణ

భువనగిరి పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి 61 మంది అభ్యర్థులు ఆయా పార్టీలతోపాటు స్వతంత్రంగా నామినేషన్లు వేయగా వారిలో 10 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 61 మంది అభ్యర్థుల్లో 51 ఆమోదించగా 10 తిరస్కరించారు.

## నేడు బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

- పార్టీ జిల్లా కార్యాలయాల్లో వేడుకలకు ఏర్పాట్లు




నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : 2001, ఏప్రిల్ 27న తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆవిర్భవించిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ నేడు 23వ ఆవిర్భావ దినోత్సవానికి సిద్ధమైంది. ఉమ్మడి జిల్లా పరిధిలోని మూడు జిల్లాల పార్టీ కార్యాలయాల్లో శనివారం పార్టీ పతకాన్ని ఆవిష్కరించనున్నారు. పార్టీ యావత్తు పార్లమెంట్ ఎన్నికల్లో నిమగ్నమైన నేపథ్యంలో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాల వేదికగానే ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహించాలని పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఆవిర్భావ వేడుకల్లో పార్టీ జిల్లా అధ్యక్షులు, కార్యవర్గం, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. ఈ మేరకు నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి జిల్లా పార్టీ కార్యాలయాల్లో వేడుకలకు సన్నాహకాలు పూర్తి చేశారు. నల్లగొండలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఉదయం 9గంటలకు ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితోపాటు జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా ముఖ్య నేతలంతా పాల్గొంటారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# చెరువులన్నీ ఖాళీ

## 80శాతానికి పైగా నీరులేక వెలవెల

- సూర్యాపేట జిల్లాలో ఎనిమిదేండ్ల తర్వాత తొలిసారి ఖాళీగా..
- సాగుకు ఇవ్వకపాయే.. కనీసం తాగునీటికైనా చెరువులు నింపని సర్కారు
- ప్రభుత్వ అవగాహనా లోపం.. నిర్లక్ష్యమే కారణం


పూర్తిగా ఎండిపోయిన ఆత్మకూర్(ఎస్) చెరువు


అడుగంటిన ఆత్మకూర్.ఎస్ మండలంలోని నెమ్మికల్ చెరువు

సూర్యాపేట, ఏప్రిల్ 26(నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ హయాంలో నిండు కుండలా జలకళను సంతరించుకున్న చెరువులు.. దాదాపు ఎనిమిదేండ్ల తర్వాత వెలవెలబోతున్నాయి. ప్రస్తుతం సూర్యాపేట జిల్లాల్లో 80శాతానికి పైగా చెరువులు నీళ్ల లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఈ సమయంలో గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నాగార్జునసాగర్ నుంచి కృష్ణా, కాళేశ్వరం నుంచి గోదావరి జలాలను వదిలి చెరువులను నింపకపోవడమే దీనికి ప్రధాన కారణం. జిల్లాలో 1,225 చెరువులకు గాను 0–25 శాతం నీటి నిల్వ ఉన్న చెరువులు 880 ఉండగా, 50శాతం నీళ్లు ఉన్న చెరువు ఒక్కటి కూడా లేదు.

### గత పరిస్థితులు పునరావృతం

సమైక్య పాలనలో వేసవి వచ్చిందంటే చాలు తాగు నీరు లేక ప్రజలు రోడ్లు ఎక్కి ధర్నాలు చేసేది. యాసంగి చివరలో ఎండిన పొలాలను చూసి తట్టుకోలేక రైతులు పంటలను తగులబెట్టిన పరిస్థితులు ఉండేవి. భూగర్భ జలాలు అడుగంటి ఆగి పోసే బోర్లు.. నీళ్లు లేక నెర్రెలు బారిన చెరువులు దర్శనమిచ్చేది. అటువంటి పరిస్థితులు మళ్లీ ఇప్పుడు పునరావృతం అవుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాగార్జునసాగర్, మూసీ, కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు పుష్కలంగా వచ్చాయి. వర్షపాతం తక్కువ ఉన్న సమయాల్లో నాడు జిల్లా మంత్రిగా ఉన్న ప్రస్తుత సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కాల్వల ద్వారా నీటిని విడుదల చేయించి చెరువులను నింపి సాగు, తాగునీటికి సమస్య తలెత్తకుండా చేశారు. కానీ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ కరువు కరాళ నృత్యం చేస్తున్నది. ఎనిమిదేండ్ల తర్వాత చెరువులు వట్టిపోయి దర్శనమిస్తున్నాయి.

### పడిపోయిన భూగర్భ జలాలు

ప్రభుత్వ అవగాహనారాహిత్యమో.. నిర్వహణ లోపమో గానీ జిల్లాలోని చెరువులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మొత్తం చెరువుల్లో దాదాపు 80 శాతం ఒట్టిపోయాయి. సూర్యాపేట జిల్లాలో 1,225 చెరువులు ఉండగా.. గతేడాది ఏప్రిల్‌లో 45 చెరువులు సర్‌ప్లస్ స్టేజీలో (అలుగు పోయడం) ఉండగా, 878 చెరువుల్లో 75 శాతానికి పైగా నీటి నిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం సర్‌ప్లస్ చెరువులు 75శాతమే కాదు, 50శాతం జలాలు ఉన్న చెరువులు జీరో ఉండడం గమనార్హం. ప్రస్తుతం 680 చెరువుల్లో 0–25 శాతం జలాలు ఉండగా, 25 నుంచి 50 శాతం జలాలు ఉన్న చెరువులు 325 మాత్రమే ఉన్నాయి. ఈ సీజన్‌లో నాగార్జునసాగర్ ప్రాజెక్టులో సరిపడా నీళ్లు ఉన్నా ప్రభుత్వం నీటిని విడుదల చేయకపోవడం.. మూడు పిల్లర్లు కుంగాయనే నెపంతో కాళేశ్వరం ప్రాజెక్టును పడుకోబెట్టడంతో కరువు పరిస్థితులు అలుముకున్నాయి. వెరసి భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. వరి పొలాలు కాపాడుకునేందుకు కనీసం ఒక్క తడికి నీటిని విడుదల చేయాలని రైతులు కోరినా పట్టించుకోకపోవడంతో పంటలు పెద్ద ఎత్తున ఎండిపోయాయి. కనీసం తాగునీటి కోసమైనా చెరువులను నింపాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే జిల్లాలో తాగునీటి కోసం జనం నానా తంటాలు పడుతున్నారు. భూగర్భజలాలు పెరిగి బోర్లు, బావుల్లో నీళ్లు ఉండేలా చెరువులు నింపకుంటే మరి కొద్ది రోజుల్లో దాహార్తితో ప్రజలు అవస్థలు పడడం ఖాయం. ఇప్పటికైనా జిల్లా మంత్రి స్పందించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన, చిత్రంలో ఎన్నికల పరిశీలకుడు మనోజ్‌కుమార్

## ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి

- ఎన్నికల పరిశీలకుడు మనోజ్ కుమార్

నల్లగొండ, ఏప్రిల్ 26 : లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్ కుమార్ మాణిక్ రావు సూర్య వంశీ కోరారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితా అన్ని పార్టీలకు అందిందా? ఏవైనా సమస్యలు ఉన్నాయా? ఎన్నికల ప్రవర్తనా నియమాలు పాటిస్తున్నారా? అని అడిగారు. ఎక్కడైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరిగినట్లయితే తక్షణమే తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈవీఎం ద్వారా పోలింగ్ రోజు నిర్వహించే మాక్ పోల్ విషయం ముందే తెలియజేశారా అని అడిగి తెలుసుకున్నారు. సి–విజిల్ యాప్, సువిధ తదితర అంశాల గురించి ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎన్నికల వ్యయ పరిశీలకుడు కళ్యాణ్ కుమార్ దాస్ మాట్లాడుతూ పోటీలో ఉన్న అభ్యర్థులు, పార్టీలు వారికి సంబంధించిన ఎన్నికల ఖర్చుల నిర్వహణను పక్కాగా నిర్వహించాలని, రిజిస్టర్లు ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ ప్రతినిధులు అన్ని అనుమతులను సింగిల్ విండో ద్వారా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నిల పోలీసు పరిశీలకుడు ఆమోఘ్ జీవన్ గాంకర్, జడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఎంసీఎంసీ తనిఖీ

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ కేంద్రాన్ని, సోషల్ మీడియా, సువిధ, ఇంటిగ్రేటెడ్ డిస్టిక్ కంట్రోల్ రూమ్, సి విజిల్ తదితర విభాగాలను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్ కుమార్, ఎన్నికల వ్యయ పరిశీలకుడు కళ్యాణ్ కుమార్ దాస్, పోలీస్ పరిశీలకుడు అమోగ్ జీవన్ గాంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ నిర్వహిస్తున్న రిజిస్టర్లు, సోషల్ మీడియా ద్వారా ఇచ్చిన ప్రకటనల గుర్తింపు, పెయిడ్ న్యూస్ స్కానింగ్, రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతి తదితర రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం సోషల్ మీడియా విభాగాన్ని సందర్శించి సోషల్ మీడియా పోస్టింగ్‌లను పరిశీలించారు. వారి వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఆర్ఓ రాజ్యలక్ష్మి, ఎంసీఎంసి మెంబర్ సెక్రటరీ, డీపీఆర్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా ఇన్ఫర్మేటిక్ అధికారి గణపతిరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### అందుబాటులో ఎన్నికల పరిశీలకులు

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం జిల్లాకు ఎన్నికల పరిశీలకులను నియమించిన నేపథ్యంలో ఇద్దరు ఎన్నికలు పూర్తయ్యే వరకు జిల్లాలో అందుబాటులో ఉండనున్నారు. నల్లగొండ జిల్లాకు లోకసభ ఎన్నికల సాధారణ పరిశీలకుడుగా 2010 ఐఏఎస్ బ్యాచ్ అధికారి మనోజ్ కుమార్ మానిక్ రావు సూర్య వంశీ గురువారం నియమితులయ్యారు. ఆయన జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బస చేయనున్నారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే 9867383846 సెల్ నంబర్‌లో అందుబాటులో ఉంటారు. ఇక జిల్లాకు పోలీసు పరిశీలకుడిగా 2011 ఐపీఎస్ బ్యాచ్ అధికారి ఆమోఘ్ జీవన్ గాంకర్ నియమితులు కాగా ఆయన సైతం జిల్లాకు చేరుకుని పోలీస్ అతిథి గృహంలో ఉన్నారు. ఆయన 9922924971 ఫోన్ నంబర్‌లో అందుబాటులో ఉంటారు.


పట్టుబడిన గంజాయిని మంటల్లో కాల్చి నిర్వీర్యం చేస్తున్న పోలీసులు

## కంచర్ల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక


రాజుకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 26 : నల్లగొండ మండలం దోమలపల్లికి చెందిన నాయకుడు అల్లోజు రాజు బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి నివాసంలో శుక్రవారం రాజుకు గులాబీ కండువా కప్పి నల్లగొండ బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు నారబోయిన భిక్షం, బడుపుల శంకర్, ఐతగోని విజయ్, నగేశ్ ఉన్నారు.

## గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు

- నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి
- పట్టుబడిన రూ.5.10 కోట్ల విలువైన గంజాయి నిర్వీర్యం

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 26 : గంజాయిని రవాణా చేసినా, విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తప్పవని నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో 39 కేసుల్లో రూ. 5.10 కోట్ల విలువైన 2,043 కేజీల గంజాయి పట్టుబడింది. కోర్టు ఉత్తర్వుల ప్రకారం వాటిని శుక్రవారం జనావాసానికి దూరంగా ఉన్న నార్కట్‌పల్లి మండలం గుమ్మల్లబావి పోలీస్ ఫైరింగ్ రేంజ్ వద్ద జిల్లా ఎస్పీ, డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో మంటల్లో కాల్చి నిర్వీర్యం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ చందనా దీప్తి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి రవాణాపై పోలీసుల నిరంతరం నిఘా ఉంటుంద తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, ఎస్‌బీ డీఎస్పీ రమేశ్, నల్లగొండ డీఎస్పీ పి. శివరాంరెడ్డి, డీసీఆర్‌బీడీ ఎస్పీ సైదా, సీఐ రాఘవరావు, భీమన్న, సైదులు, నాగరాజు, ఆర్ఐలు సూరప్పనాయుడు, సంతోష్, ఎస్ఐ అంతిరెడ్డి పాల్గొన్నారు.

## నిప్పుల కొలిమి

- 45.2 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు
- వడగాలులతో జనం ఇబ్బంది


నల్లగొండలో ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన రోడ్లు

నల్లగొండ, ఏప్రిల్ 26 : ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం నుంచి భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. జిల్లాలో శుక్రవారం రికార్డు స్థాయిలో 45.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిడమనూరులో అత్యధికంగా 45.2 డిగ్రీలు, మాడ్గులపల్లిలో 45.1, త్రిపురారం, వేములపల్లిలో 45.0 డిగ్రీలు నమోదయ్యాయి. మరో పది మండలాల్లో 44 డిగ్రీలకు పైగా, మిగిలిన మండలాల్లో 42 నుంచి 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉన్నాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం 30 డిగ్రీలకుపైనే ఉంటున్నాయి. ఎండలకు బయటికి వెళ్లాలంటేనే జనం జంకుతున్నారు. అత్యవసర పనులు ఉంటే ఉదయం, సాయంత్రం చూసుకొని ఇంటికే పరిమితమవుతున్నారు. రైతులు, కూలీలు, కార్మికులకు ఎండలతో ఇబ్బందులు తప్పడం లేదు. వడగాలులతోపాటు ఉక్కపోతతో జనాలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఏసీలు, కూలర్ల వినియోగం భారీగా పెరిగింది. శీతల పానీయాలు, మజ్జిగ, కుల్‌డ్రింక్స్ వ్యాపారాలు జోరందుకున్నాయి. వడదెబ్బ కొట్టే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.



నల్లగొండలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న నూతన కోర్టు భవనాల సముదాయం

## నేడు నూతన కోర్టు భవనాలు ప్రారంభం

- హాజరుకానున్న రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే

రామగిరి, ఏప్రిల్ 26 : నల్లగొండ జిల్లా కోర్టు ఆవరణలో నూతనంగా నిర్మించిన కోర్టు భవనాల ప్రారంభోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సాయం త్రం 5గంటలకు జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి అలోక్ అరాధేతోపాటు హైకోర్టు న్యాయమూర్తులు టి.వినోద్ కుమార్, కె.లక్ష్మణ్, బి.విజయ్ సేన్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. అలోక్ అరాధే కోర్టు భవనాల ప్రారంభోత్సవం కంటే ముందు నల్లగొండలోని పానగల్ చాయా సోమేశ్వరాలయం సందర్శించి పూజలు నిర్వహించనున్నారు.

## ఫిర్యాదులు, సూచనలకు ఎన్నికల పరిశీలకుడిని సంప్రదించాలి

- కలెక్టర్ హనుమంతు జెండగే

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 27 : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించి సూచనలు, ఫిర్యాదుల కోసం జనరల్ అబ్జర్వర్‌ను సంప్రదించవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి మణిపూర్ క్యాడర్‌కు చెందిన రాబర్ట్ సింగ్ క్షేత్రిమయుమ్‌ను జనరల్ అబ్జర్వర్‌గా ప్రభుత్వం నియమించిందని పేర్కొన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆలేరు, భువనగిరి, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి, జనగాం, ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఓటర్లు, ఆయా పార్టీలు, అభ్యర్థులు సూచనలు, ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. ఇందుకోసం ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఫోన్ నంబరు 9963469221 ద్వారా సంప్రదించవచ్చని పేర్కొన్నారు. భువనగిరి కలెక్టర్ కార్యాలయం ఫస్ట్ ఫ్లోర్‌లోని స్టేట్ చాంబర్‌లో ప్రతి రోజూ సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య ఫిర్యాదులు, సూచనలు చేయొచ్చని తెలిపారు. జనరల్ అబ్జర్వర్‌కు లైజనింగ్ అధికారిగా జిల్లా మత్స్యశాఖ అధికారి పి.రాజారామ్ (సెల్ నంబర్ 90003 68915) వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- కలెక్టర్ హరిచందన

నల్లగొండ, ఏప్రిల్ 26 : నల్లగొండ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, నల్గొండ పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన ఎన్నికల పరిశీలకులకు వివరించారు. తన చాంబర్‌లో శుక్రవారం కలెక్టర్ హరిచందన ఎన్నికల ప్రణాళికపై జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్ కుమార్ మాణిక్ రావు సూర్యవంశీ, జిల్లా వ్యయ పరిశీలకుడు కళ్యాణ్ కుమార్ దాస్, పోలీస్ పరిశీలకుడు అమోఘ జీవన్ గాంకర్, సూర్యాపేట కలెక్టర్ ఎస్.వెంకటరావు, నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి, సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీలు, పోలీసు, రెవెన్యూ అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికలు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు, అసెంబ్లీ సెగ్మెంట్లు, సమస్యాత్మక కేంద్రాలు, ఎన్నికల సిబ్బంది తదితర అంశాలను తెలియజేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఆర్ఓడీ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- కలెక్టర్ హరిచందన

నల్లగొండ, ఏప్రిల్ 26 : వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించినందున దీనికి అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన కోరారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఆమె రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు మే 2న నోటిఫికేషన్ జారీ చేస్తామని, ఆ రోజు నుంచి మే 9 వరకు నామినేషన్ల స్వీకరణ, మే 10న నామినేషన్ల పరిశీలన, మే 13న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. మే 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, జూన్ 5న కౌంటింగ్ ఉంటుందని, జూన్ 8న ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని ఆమె వెల్లడించారు. ఈ ఎన్నికలకు నల్లగొండ జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారని, 12 జిల్లాల్లో 37 మంది ఏఆర్వోలు పనిచేస్తారని తెలిపారు. మొత్తం 600 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు, 4,91,396 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్ కుమార్ మాణిక్ రావు సూర్యవంశీ, వ్యయ పరిశీలకుడు కళ్యాణ్ కుమార్ దాస్, పోలీస్ పరిశీలకుడు అమోఘుజీవన్ గాంకర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు

## నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలి : జడ్పీ సీఈఓ

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 26 : వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ ఎన్.శోభారాణి అధికారులకు సూచించారు. జడ్పీ కార్యాలయంలో శుక్రవారం జిల్లాలో తాగునీటి సమస్య, అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్య ఏర్పడకుండా పూర్తిస్థాయిలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అధికారులకు సూచించారు. ఈ ఏడాది జూన్ నాటికి అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఈఓ నారాయణ రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ కరుణాకర్‌పాల్గొన్నారు.

## రెండో విడుత ర్యాండమైజేషన్ పూర్తి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు హనమంతు జెండగే, సాధారణ ఎన్నికల పరిశీలకుడు రాబర్ట్ సింగ్ క్షేత్రిమయుమ్

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 26 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా రెండో విడుత ర్యాండమైజేషన్ పూర్తయినట్లు ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాబర్ట్ సింగ్ క్షేత్రిమయుమ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనమంతు కె.జెండగే తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పీఓ, ఏపీఓ, ఓపీఓల రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భువనగిరి జిల్లాలోని 17 మండలాలకు సంబంధించి 816 పోలింగ్ కేంద్రాలకుగానూ పోలింగ్ విధుల నిర్వహణకు 3856 మంది సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టరు పి.బెన్ షాలోమ్, మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి కె.నారాయణ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి జగన్మోహన్ ప్రసాద్, ఈడీఎం సాయికుమార్, ఏఎస్ఓ. నరహరి పాల్గొన్నారు.

## చెరువులోకి దూసుకెళ్లిన కారు


పాల్వాయిగూడెం చెరువులో పడిపోయిన కారు

బీబీనగర్, ఏప్రిల్ 26 : కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. కారు నీటిలో మునిగిపోగా అందులో ఉన్న ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటన బీబీనగర్ మండలంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ పట్టణానికి చెందిన రాజ్‌కుమార్, ప్రశాంత్ ఇద్దరు స్నేహితులు కలిసి పోచంపల్లి మండలంలోని జూలూరు గ్రామంలో ఓ వివాహానికి హాజరయ్యారు. వివాహం అనంతరం తిరుగు ప్రయాణంలో జూలూరు నుంచి బీబీనగర్ మండలం పాల్వాయిగూడెం, భట్టుగూడెం గ్రామాల మధ్యకు చేరుకోగానే కారు అదుపుతప్పి అక్కడ ఉన్న చెరువులోకి సుళ్లింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు చాకచక్యంగా వ్యవహరించి చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు.